దివ్యాంగులతో బాధ్యతగా మెలగాలి

- అదనపు సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి
- ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుస్వామి

నరసరావుపేటటౌన్: ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల బాధ్యతతో మెలగాలని అదనపు సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం లూథరన్ అంధుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులకు సంబంధించి ఉన్న వివిధ చట్టాల గురించి వివరించారు. ఉచిత న్యాయసహాయం పొందే విధానాన్ని వివరించారు. రోజువారీ జీవితంలో అవసరమయ్యే చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ, హెచ్ఎం విజయ పాల్గొన్నారు.

వినుకొండలో

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులను అందరితో సమానంగా ఉండేలా ప్రోత్సహించడం, వారిలోని ప్రతిభను గుర్తించి దానిని వెలికితీయడం గొప్పవిషయమన్నారు. విద్యార్థులతో సాంస్కృతి కార్యక్రమాలు చేయించారు. అనంతరం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం. వజ్రకుమారి,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్లలోని సహిత విద్య వనరుల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీహెచ్‌సీ డాక్టర్ పుష్పేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, నాగమణి, సహిత కేంద్రం ఉపాధ్యాయులు రంగారావు, యలమందరావు, సీఆర్‌పీ మంజీష, సుభాని పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

శావల్యాపురం: స్థానిక భవిత సెంటరులో ప్రత్యేక అవసరాల కలిగిన చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. సీడీపీఓ ముదివర్తి అనూరాధ మాట్లాడుతూ విద్యతో నిమిత్తం లేకుండా అన్ని రంగాల్లో రాణించేలా భవిత సెంటరు ఉపాధ్యాయులు చిన్నారులను ప్రోత్సాహించటం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు రాజారమేష్, ఎంఈఓలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితకుమారి, సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, లేబర్ చైల్డ్ జిల్లా కౌన్సెలర్ కె.శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతి, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: ప్రత్యేక అవసరాల పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ వాళ్లకు చేయూతనిచ్చి వారి భవిష్యత్‌కు తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ హవీలా కోరారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను వారి పిల్లలకు అందేటట్లు తల్లిదండ్రులు సహకరించి భవిష్యత్‌కు ఊతం ఇవ్వాలన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బీఎం సుభాని, జయశ్రీ, సహిత, ఎస్.సురేష్‌కుమార్, డి.నిర్మల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్, ప్రధానోపాధ్యాయురాలు కే అపర్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు అందిపుచ్చుకోవాలని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు బాబూరావు, సుభాషిని, ఉపాధ్యాయులు మహేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులను అందరూ గౌరవించాలి



యడ్లపాడు భవిత కేంద్రంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నాగరత్నం

యడ్లపాడు: దైవ స్వరూపానికి నిదర్శనాలు దివ్యాంగులు మండల విద్యాశాఖ అధికారి-1, 2 నాగరత్నం, అరుణకుమారి పేర్కొన్నారు. యడ్లపాడు భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శారీరక, మానసిక లోపం ఉన్నవారిలో ఏదో ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందన్నారు. భవిత కేంద్రాల ద్వారా వారి లోపాన్ని సరిచేసుకునే వీలుంటుందని తల్లిదండ్రులు గ్రహించి వారిలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. దివ్యాంగ పిల్లలు ఎంతో ప్రయోజనాన్ని ఇచ్చే సదరం సర్టిఫికెట్లను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ ఆటలు, సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదే వేదికపై భవిత కేంద్ర విద్యార్థులు కె.దేవకి, వి.జాన్ సుధాకర్‌లకు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఐఈఆర్‌పీఎస్ పి.సామ్రాజ్యం, ఎస్.ఖుదాబి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక ఉర్దూ పాఠశాల హెచ్ఎం ఆయేషా, ఎంపీపీఎస్ ఓల్డ్ యూపీ పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఎమ్మార్సీ అకౌంటెంట్ ముత్తయ్య, సీఆర్‌పీఎస్ రాజేష్, సరిత, పద్మజ పాల్గొన్నారు.



పట్టణంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ జఫ్రుల్లా



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ అనూరాధ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ హవీలా



పోటీల్లో విజేతకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ

బాలికలు క్రీడల్లో సత్తా చాటడం అభినందనీయం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



శావల్యాపురం: బాలికలు క్రీడల్లో రాణించటం అభినందనీయని క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి దోహదపడతాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో సత్తా చూపిన శావల్యాపురం హైస్కూలు బాలికల జట్టు అభినందన కార్యక్రమం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించటానికి కృషి చేసిన ఉమ్మడి గుంటూరు జిల్లా కోచ్ పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్‌లో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించటంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఈ ఏడాది సబ్‌జూనియర్, సీనియర్ విభాగ క్రీడా పోటీల్లో పతకాలు సాధించటం ఉపాధ్యాయులు పనితీరుకు నిదర్శమన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు, ఎంఈఓలు మద్దికుంట సాంబశివరావు, జఫ్రుల్లాఖాన్, పార్వతి, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు గరికపాటి రవి,భువనేశ్వరి, సహనాజ్‌బేగం, హలీమా, నిర్మల, మురకొండ శ్రీనివాసరావు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

నకరికల్లు: త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి దైవజ్ఞానం పెంపొందించుకోవాలని జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దారెడ్డి సూచించారు. మార్గశిరమాసం పురస్కరించుకొని త్రైతసిద్ధాంతం - ప్రబోధసేవాసమితి ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని దేచవరం గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం మంగళవారం చేపట్టారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: మండలంలోని యడవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రానైట్, ఇతర పరిశ్రమలకు సరఫరా ఉండదన్నారు.

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

ఎమ్మెల్యే చదలవాడ



నరసరావుపేట: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా ఉంచడం కోసమే ప్రతిరోజూ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయన వెంట మున్సిపాల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



నరసరావుపేట రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని యల్లమందలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులకు, చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహర పంపిణీపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సేవలను బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కడియాల తాండవకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలోని మాచవరం పంచాయతీ కార్యాలయంలో బుధవారం డాక్టర్ ఎంవీ రెడ్డి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఎం.వివేకానందరెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో కంటికి సంబంధించిన శుక్లాలు, పొరలు, నీటికాసులకు పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మాచవరం, చుట్టపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని హార్ట్ జూనియర్ కళాశాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ నమూనా పరీక్ష మంగళవారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఆదేశాల మేర 180 మార్కులకు నమూనా పరీక్ష నిర్వహించారు. పరీక్షా పేపర్‌ను పల్నాడు జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ హుస్సేన్, మండల విద్యాశాఖాధికారి ఎన్.ఏసుబాబు, ఎస్.నాగేశ్వరరావు, రిటైర్డ్ హెచ్ఎం ఎంఎస్ఆర్‌కే ప్రసాదు, పల్నాడు బాలోత్సవ కమిటీ సభ్యులు కట్టా కోటేశ్వరరావు, కోయ రామారావు, వెంకయ్యచౌదరి ఆవిష్కరించారు. ఈ నెల 8వ తేదీన మెయిన్ పరీక్ష ఉంటుందని, ప్రాక్టీస్ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. పరీక్షల్లో కే పూజిత, ఎన్.భరత్‌హరి, కే గాయత్రి, జాన్‌వెస్లీ ప్రతిభ కనపరిచారు. గెలుపొందిన వారికి హుస్సేన్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీ మధుకుమార్, రిటైర్డ్ డీఎస్ఓ ఎస్.శివశంకర్, ఎస్.రమేష్, రఘురాం, చాంద్‌బాషా, పి.హేమమాలిని, సునీత, ప్రిన్సిపాల్ ఫిజి పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికల అధికారుల నియామకం

సత్తెనపల్లి: సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల కానుండగా 8న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనుంది. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. సత్తెనపల్లి మండలంలో మొత్తం 15 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కాగా ఒక్కో సాగునీటి సంఘానికి 12 టీసీలు (ప్రాదేశిక నియోజక వర్గం) చొప్పున 180 ఉన్నాయి.

ఫసల్‌బీమాతో పంటలకు రక్షణ



అమీన్‌సాహెబ్‌పాలెంలో రైతులకు అవగాహన కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, శాస్త్రవేత్త నగేష్

నాదెండ్ల: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా జిల్లాలో ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పథకం అమలు చేస్తున్న దృష్ట్యా రైతులు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ చెప్పారు. అమీన్‌సాహెబ్‌పాలెం, కనపర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత సీనియర్ శాస్త్రవేత్త ఎం.నగేష్, ఏఓ హరిప్రసాద్, రైతులతో కలిసి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ, వరి, మొక్కజొన్న పంటల్లో ఎరువులు, పురుగుమందుల వినియోగంపై వివరించారు. శాస్త్రవేత్త నగేష్ మాట్లాడుతూ శనగ, నువ్వులు, మిరప, మొక్కజొన్న వంటి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. స్వచ్ఛందంగా రైతులు ఫసల్ బీమా యోజనలో 1.5 శాతం ప్రీమియం చెల్లించాలన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.630 చెల్లిస్తే బీమా రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు జీవన్‌నాయక్, నాగరత్నకుమార్, రామాంజమ్మ, సర్పంచి కామినేని లలిత, రైతు సంఘ నాయకులు గుర్రం నాగపూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

డీఎస్పీ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వలన దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డీఎస్పీ కె.నాగేశ్వరరావు చెప్పారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో మాదక ద్రవ్యాల వినియోగం వాటి దుష్ఫలితాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాల వాడకం వలన భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. ప్రధానంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేసేందుకు యుక్త వయస్కులను లక్ష్యంగా చేసుకుంటున్నారని, ఒక చెయిన్ లా సాగుతుందని చెప్పారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉండే కిళ్లీ దుకాణాలు, కాఫీ షాపుల ద్వారా కూడా వీటి సరఫరా సాగుతూ ఉంటుందని హెచ్చరించారు. నరసరావుపేట పట్టణ టూటౌన్ సీఐ కె.హైమారావు మాట్లాడుతూ సాధారంగా సిగరెట్లు, ఆల్కహాల్ ద్వారా మాదకద్రవ్యాలు తీసుకోవడం మొదలవుతుందని, వీటిని గేట్‌వే ఆఫ్ డ్రగ్స్ అంటారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు కేంద్ర నాడి వ్యవస్థపై పనిచేసి శరీర అవయవాలతో పాటు మెదడుపై ప్రభావం చూపిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, ఏవీఎస్ గుప్తా, వూటుకూరి స్వామి, ఎస్ఎస్ఎన్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ కె.రేణుక, వైస్ ప్రిన్సిపాల్ బి.నీల్‌పీటర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ విజేత బేతపూడి



ఫైనల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

బొల్లాపల్లి: మండలంలోని రెడ్డిపాలెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బేతపూడి జట్టు ప్రథమస్థానం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో 15 జట్లు పాల్గొనగా వీటిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ స్థానాల్లో బేతపూడి, బాపట్ల, పమిడిపాడు, జింకలపాలెం జట్లు నిలిచాయి. పిడుగురాళ్లకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.దుర్గాప్రసాద్ గెలుపొందిన జట్లకు షీల్డ్‌లు బహూకరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రతి ఏటా శౌరివారి ఉత్సవాలను పురస్కరించుకొని వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీల్లో వాలీబాల్ క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. బహుమతులు పంపిణీ చేసిన వారిలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, విచారణ గురువులు వై.జాకబ్‌రెడ్డి, పి.బాలచంద్, గ్రామసర్పంచి కె.ప్రభాకరరావు, శ్రీ చక్ర సిమెంట్ యాజమాన్యం, ఔకు శివప్రసాద్, నిర్వాహకులు సీహెచ్ రాజేశ్వరరావు, కె.ప్రకాశరావు ఉన్నారు.

కొనసాగుతున్న వర్షాలు



రొంపిచర్ల: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మంగళవారం కూడా వర్షం పడింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఉదయానికి 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. వర్షంతో వ్యవసాయ పనులు నిలిచి పోయాయి. ఏపుగా పెరిగిన వరి పొలం వర్షానికి ముదురు వరిపైరు అక్కడక్కడ నేలవారింది. పుల్లశనగ ఎదుగుదలకు ఈ వర్షాలు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ఎంఈఓ లక్ష్మి



చిలకలూరిపేట: మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఈ నెల 7న విజయవంతంగా నిర్వహించాలని ఎంఈఓ కె.లక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎంసీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశానికి విద్యార్థులను సంసిద్ధులను చేయాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వ్యక్తిగతంగా ఆహ్వానాలు పంపాలని సూచించారు. పండుగా వాతావరణంలో మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో పాఠశాల వివరాలతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతుల వివరాలు, విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటుగా విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఐరన్ టాబ్లెట్ల పంపిణీ, రక్తపరీక్షల నిర్వహణ గురించి తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షల్లో పొందిన మార్కుల వివరాలను హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టు ద్వారా తెలియజేయాలన్నారు. అనంతరం బీఆర్‌ఐజీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం జీవీ రమణరావుతో కలసి మధ్యాహ్నభోజనం పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం పోటు శ్రీనివాసరావు, ఎన్.అంజమ్మ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



ఎస్ఐ లోకేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

శావల్యాపురం: మాదకద్రవ్యాలు, డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపంలో సంసిద్ పాఠశాల్లోని విద్యార్థులకు మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవటం వలన అనర్థాలను వివరించారు. అలాగే సెల్‌ఫోన్లుకు దూరంగా ఉండాలని సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరానికి మించి వినియోగించరాదని పేర్కొన్నారు. రోడ్లు దాటుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి అవగాహన పెంపొదించుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఐ లోకేశ్వరరావును పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగసురేష్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

చెడు వ్యసనాలకు..

నాదెండ్ల: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులు కన్న కలలను, ఆకాంక్షలను నెరవేర్చాలని ఎస్ఐ జి.పుల్లారావు చెప్పారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, బ్యాడ్-గుడ్ టచ్, డ్రైవింగ్‌లో జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు కష్టపడి బిడ్డలను చదివిస్తున్నారని, విద్యార్థులకు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ఆ తల్లిదండ్రులకు సంతృప్తిగా ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని వారిలా ఎదిగేందుకు పోటీపడాలన్నారు. చిన్నారులు సెల్‌ఫోన్, వాహన డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఆడపిల్లలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా బ్యాడ్‌టచ్‌కు పాల్పడినా, వేధించినా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని, లేదా నేరుగా 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కెల్లంపల్లి రెడ్డియ్య చౌదరి పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు

ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని



చిలకలూరిపేట: ప్రభుత్వం మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్సులు రద్దు చేస్తామని ప్రకటిస్తున్నా గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారని అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తాగడానికి గుక్కెడు నీళ్లు కరువైన గ్రామాల్లోనూ, పట్టణంలోని శివారు కాలనీల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. బెల్టుషాపునకు ఒక్కో ధర చొప్పున మద్యం షాపుల యజమానులు నిర్ణయించి మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టుషాపులు మహిళలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని పల్లెసీమల్లో బెల్టుషాపులు చిచ్చురాజేస్తున్నాయని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే మద్యం దుకాణాలు మూసివేయాల్సి ఉండగా, పగలు రాత్రి తేడా లేకుండా 24 గంటలు మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలల హక్కులను కాపాడాలి

క్రోసూరు: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ అన్నారు. మంగళవారం అమరావతి, గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు పీహెచ్‌సీలో బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన అనే అంశంపై ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడ్‌షెఫర్డ్ సంస్థ మండల ఇంచార్జి తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిర్మూలించాలన్నారు. గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ తమ సంస్థ 74 దేశాల్లో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా, బాలల హక్కులపై పనిచేస్తుందన్నారు. ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, పర్యవేక్షకులు ప్రభావతి, అమర జ్యోతి, శివుడు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల స్నానం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో త్రిశూలస్నానం వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్షబిల్వార్చన వేడుకల్లో భాగంగా స్వామివారి త్రిశూలస్నాన ఘట్టం అత్యంత పవిత్రంగా జరిపించారు. అర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి త్రిశూలాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కోనేటివద్దకు తీసుకువెళ్లి పూజాధికాలు నిర్వహించారు. అనంతరం కోనేటిలో త్రిశూల స్నానఘట్టం జరిపించారు. వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్నానఘట్టం అనంతరం విశ్వరూప అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అన్నప్రసాద వితరణలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.